క్లుప్తంగా

మండల పరిషత్ సమావేశం రేపు

కారంచేడు: మండల పరిషత్ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె. నేతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలనకు స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యురాలు, గ్రామ సర్పంచ్‌లు, కోఆప్షన్ మెంబర్, మండలంలోని అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా హాజరుకావాలన్నారు.

ప్రారంభానికి ఎదురు చూపులు



గుంటుపల్లి పీహెచ్‌సీ లో ప్రారంభానికి ఎదురు చూస్తున్న బీపీహెచ్ యూనిట్

బల్లికురవ : విపత్కర పరిస్థితుల్లో రోగులకు ఆసరాతో వైద్యసేవలు అందించేందుకు మండలంలోని గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీపీహెచ్ యూనిట్ మంజూరైంది. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా గత ఏడాది ఫిబ్రవరిలో రూ. 50 లక్షల నిధులు మంజూయ్యాయి. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు పూర్తిచేసి నాలుగు మాసాలైంది. అయితే భవనం ప్రారంభించనందున కాంట్రాక్టర్ వైద్యఆరోగ్య శాఖకు అప్పగించనట్లు తెలుస్తోంది. కాగా ప్రస్తుతం ఉన్న భవనాలు అన్ని రకాల సేవలు అందించేందుకు ఇబ్బందికరంగా మారింది. నలుగురు వైద్యులు, సిబ్బంది, సమావేశాల నిర్వహణ, రోగులకు బెడ్లు ఏర్పాటు ఆపరేషన్ థియేటర్, ఇక్కడే కావటంతో ఇబ్బందులు తప్పటంలేదు. ఇప్పటికైనా బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను వైద్యశాలకు అప్పగించాలని మండల ప్రజలు, రోగులు వేడుకుంటున్నారు.

వ్యవసాయ పనులకు సమాయత్తం



సోమవరప్పాడులో విత్తనాలు ఎదపెడుతున్న రైతు, కూలీలు

బల్లికురవ: ఇటీవల కురిసిన వర్షాలకు మెట్ట భూములు పదునెక్కటంతో వ్యవసాయ పనులకు గ్రామాలవారీగా రైతులు సమాయత్తమవుతున్నారు. వేమవరం, ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు, కోటావారి పాలెం, కొప్పెరపాలెం, మల్లాయపాలెం, బల్లికురవ, నక్కబొక్కలపాడు, గుంటుపల్లి, వల్లాపల్లి, కొత్తపాలెం గ్రామాల్లో దుక్కులు పదునెక్కటంతో గోర్రుతోలి అత్తుతో విత్తనాలు ఎదపెడుతున్నారు. పత్తి, కంది, పెసర, మినుము, మొక్కజొన్న సాగుకు మంచి అదునని రైతులు తెలిపారు. వ్యవసాయాధికారి పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు నాణ్యత కలిగిన మేలైన విత్తనాలను ఆథరైజ్డ్ డీలర్ల వద్ద కోనుగోలు చేయాలని విత్తనాలతోపాటు బిల్లు భద్రపరచుకోవాలని కోరారు.

ఆధార్ సెంటర్లతో ఉపయోగం



కారంచేడులో ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నేతాజీ

కారంచేడు: గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్లను ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె. నేతాజీ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్‌ను పరిశీలించారు. రోజుకు ఎంత మంది ఆధార్ సెంటర్‌లో తమ డేటాను అప్‌డేట్ చేసుకుంటున్నారని అడిగారు. నూతనంగా అవసరమైన వారు ఎంత మంది రిజిస్టర్ చేసుకుంటున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆధార్ సెంటర్‌లో ఉన్న సదుపాయాలు, ఉండాల్సిన సదుపాయాలపై ఆయన దృష్టి సారించారు. లబ్ధిదారులకు అవసరమైన అన్ని రకాల సదుపాయములను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆధార్ సెంటర్ ద్వారా అందుతున్న సేవలను కూడా ఆయన ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. ఈఓపీఆర్డీ ఎల్‌కే కృష్ణ, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

చార్జింగ్ మైక్ బాక్స్ వితరణ

సంతమాగులూరు (అద్దంకి రూరల్) : మండలంలోని పాతమాగులూరు ఎంపీపీ (ఏఏ) పాఠశాల, ఎంపీపీ (హెచ్‌ఈ) పాఠశాలలకు సర్పంచ్ జిర్రా విజయ్‌బాబు మిత్రుడు జాఫర్ చార్జింగ్ మైక్ బాక్సులను సమకూర్చారు. వాటిని ఎంఈఓ వి. కోటేశ్వరరావు చేతుల మీదుగా పాఠశాల హెచ్‌ఎంకు అందజేశారు. కార్యక్రమంలో చల్లా కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రమాదాలకు ఎస్



ప్రమాదభరితంగా బ్రిడ్జి మూలమలుపు



బ్రిడ్జి జాయింట్లలో ఏపుగా పెరుగుతున్న రావి మొక్కలు

- నిర్లక్ష్యపు నీడలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి
- బ్రిడ్జి జాయింట్లలో పెరుగుతున్న రావి మొక్కలు
- 'ఎస్' ఆకారంలోని మలుపులవల్ల ప్రమాదాలు
- ఇప్పటి వరకు 25 మంది మృత్యువాత

చీరాల రూరల్: ప్రభుత్వ నిర్లక్ష్యం పౌరుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. చీరాల రైల్వే ప్లైఓవర్ బ్రిడ్జి ప్రమాదభరితంగా మారింది. బ్రిడ్జి జాయింట్లలో రావి మొక్కలు పెరిగడంతో పగుళ్ల ఏర్పడుతున్నాయి. దీనితో పాటు ప్రమాద భరితంగా మారిన మూలమలుపుల్లో సూచిక బోర్డులు లేకపోవడంతో నిత్యం జరిగే ప్రమాదాల వలన ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. బ్రిడ్జి నిర్మించి ఇరవై ఐదేళ్లకుపైగా అవుతుండగా ఇప్పటికే ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. ప్రతిరోజూ వందలాది వాహనాలు ప్రయాణిస్తున్నా ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు.

వంతెన ఆకారంతో చిక్కులు

ఈ బ్రిడ్జిని ఎస్ ఆకారంలో నిర్మించారు. కారంచేడు వైపు వాహనాలు వెళ్లేందుకు వీలుగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి రైల్వే ట్రాక్ మీదుగా కారంచేడు రైల్వే గేటు సెంటర్‌కు దగ్గరగా ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగింది. ఈ నిర్మాణం కాకముందు ఈ ప్రాంతంలో రైల్వే క్యాబిన్ గేటు ఉండేది. రైళ్లు వెళ్లే సమయంలో గేటును మూసివేసేవారు. ఆ సమయంలో గేట్లకు రెండువైపులా గంటల తరబడి వాహనాలు బారులుతీరి నిలిచిపోయేవి. ఇది గమనించిన అధికారులు బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ. 9 కోట్లు వెచ్చించి నిర్మించారు. కానీ స్థలం సరిపడా లేకపోవడంతో నేరుగా కాకుండా ఎస్ అక్షరం రూపంలో నిర్మించారు. అంటే రెండు వైపులా భారీ మూల మలుపులు ఏర్పడ్డాయి. ఇవే వాహనదారుల ప్రాణాలను హరిస్తున్నాయి. అతి వేగంగా అటు వైపు తొలిసారి వెళ్లే వాహనదారులు మూల మలుపులు అర్థంకాక బ్రిడ్జి డివైడర్లను ఢీకొని ప్రమాదాలబారిని పడుతున్నారు. రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో బ్రిడ్జిపై విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఓ ద్విచక్రవాహన దారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బ్రిడ్జి నిర్మించినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 25 మంది వరకు మృత్యువాత పడ్డారు.

శిథిలమవుతున్న కాంక్రీటు నిర్మాణాలు

రావి మొక్కలు పెరిగి వాటివేర్లు బ్రిడ్జి లోపలికి చొచ్చుకుని వెళుతుండడంతో పిల్లర్లు, శ్లాబు దెబ్బతిని పెచ్చులూడిపోతున్నాయి. అంతేకాక వర్షపు నీరు పెరిగిన రావి మొక్కల ద్వారా జాయింట్లలోకి చేరుతుండటంతో కూడా ప్రమాదం పొంచి ఉంది. ఆర్టీసీ బస్టాండ్ నుంచి బ్రిడ్జి ప్రారంభమైన కొద్ది దూరంలో తారులేచిపోయి గుంతల మయంగా మారిపోయింది. రాత్రి సమయంలో ప్రయాణించే వాహనదారులకు ఈ గుంతలు కనపడక ప్రమాదాల బారిన పడుతున్నారు. అలానే బ్రిడ్జి మధ్య భాగంలో రైల్వే ట్రాక్‌పై కూడా సిమెంట్‌లేచిపోయి పెద్ద గుంతలు ఏర్పాడ్డాయి. దీని వలన శ్లాబులో వేసిన ఇనుప గడ్డర్లు బయటపడ్డాయి. వాహనాలు వెళ్లే సమయంలో ఇనుప గడ్డర్లు పెద్ద శబ్దాలు చేస్తు భయాందోళనలు కలిగిస్తున్నాయి. అలానే మరో రెండు మూడు ప్రాంతాల్లో కూడా గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కాలంలో ఈ గుంతలు తూతూ మంత్రంగా పూడ్చి మమ అనిపించారే తప్ప సక్రమంగా పూడ్చకపోవడంతో ఎగుడుదిగుడుగా ఉండి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. బ్రిడ్జిపై జాయింట్లలో మొలచిన రావి మొక్కలను సకాలంలో తొలగించి గుంతలను పూడ్చినట్లయితే కొంతమేర బ్రిడ్జి బలం పుంజుకుంటుంది. అలానే మూల మలుపులలో వాహనాల వేగాన్ని నియంత్రించే సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లయితే ప్రమాదాలను నివారించి ప్రాణ నష్టం జరగకుండా చూడవచ్చు.

కాటాలకు రెన్యువల్ తప్పనిసరి

చీరాల టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి వ్యాపారస్తుడు విధిగా వారి తూకం (కాటాలను) ఏడాదికి ఒకసారి రెన్యువల్ చేయించుకుని వ్యాపార కార్యకలాపాలు చేసుకోవాలని తూనికలు, కొలతల శాఖ చీరాల ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు సూచించారు. గురువారం చీరాల మండలంలోని ఈపురుపాలెం కూరగాయల మార్కెట్, దేవాంగపురి కూరగాయల మార్కెట్‌తో పాటు, పేరాల మార్కెట్, చీరాల పట్టణంలోని నెహ్రూ కూరగాయల మార్కెట్‌లోని కూరగాయల దుకాణాలు, మార్కెట్ సమీపంలోని పండ్ల దుకాణాల్లోని కాటాల రెన్యువల్స్‌ను పరిశీలించారు. వ్యాపారస్తులకు అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు అందించారు. ఈసందర్భంగా తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరారవు మాట్లాడుతూ ప్రతి వ్యాపారస్తుడు విధిగా తమ తూకం కొలిచే కాటాలను, రాళ్లను విధిగా క్రమబద్ధీకరించుకోవాలన్నారు. వినియోగదారులకు తూకాల్లో మోసాలు జరగకుండా ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ ఆదేశాలను విధిగా పాటించాలన్నారు. తూకం రాళ్లు, డిజిటల్ కాటాలను తూనికల ఇన్‌స్పెక్టర్ వద్ద రెన్యువల్ చేయించుకోవాలని, తూకంలో తేడాలు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలన్నారు. వినియోగదారులను మోసాలకు గురిచేస్తే వ్యాపారులపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతో భవిత



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న గ్రామ సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి

చినగంజాం: విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంచుతూ విద్యనందించాలని అందుకోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని కొత్తపాలెం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి సూచించారు. గురువారం ఆయన కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని మూలగాని వారిపాలెం ఎంపీపీ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజనం నాణ్యత, యూనిఫాం, బూట్లు, బెల్టులు, పాఠ్యపుస్తకాలు తదితర అంశాలపై ఉపాధ్యాయులతో మాట్లాడారు.

విద్యార్థుల్లో క్రమ శిక్షణ అలవర్చుకునేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, నాణ్యమైన యూనిఫాం, వ్యక్తిగత పరిశుభ్రత, నాణ్యమైన మధ్యాహ్న భోజనం తదితర అంశాలపై శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు.

అంకితభావంతో తగిన గుర్తింపు



కొడవలివారిపాలెంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

కొడవలివారిపాలెం (కారంచేడు): వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు ఎప్పటికైనా తగిన గుర్తింపు లభిస్తుందని హెచ్‌ఎం ఎం. ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల వీడ్కోలు సభలో మాట్లాడారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించి గత నెలలో నిర్వహించిన సాధారణ బదిలీల్లో ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్ళిన ఇంగ్లిషు ఉపాధ్యాయుడు బాబు, ఎస్‌ఎస్‌ఏ ఉపాధ్యాయుడు మస్తాన్‌రావు, లెక్కలు టీచర్ భానుప్రియ, పీడీ పి. శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వీడ్కోలు సభ నిర్వహించారు. ఎక్కడ పనిచేసినా చక్కగా బాధ్యతలను నిర్వహించాలని సూచించారు. ఉపాధ్యాయులందరినీ పూల బొకేలతో, దుశ్శాలువాలతో సత్కరించారు.

చీరాల టౌన్: గ్రామ సచివాలయాల ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎంపీడీఓ శివన్నారాయణ సూచించారు. గురువారం మండలంలోని రామృకృష్ణాపురం, సాల్మన్‌సెంటర్ గ్రామ పంచాయతీల్లోని సచివాలయాలను ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యల అర్జీలు, సచివాలయ ఉద్యోగుల పనితీరు, రికార్డులను పరిశీలించారు. సచివాలయానికి కేటాయించిన ఉద్యోగుల హాజరు, శాఖల వారీ ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. ఉత్తమ సేవలందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు.

కేఆర్‌కే అధ్యాపకుడికి డాక్టరేట్

అద్దంకి రూరల్: అద్దంకిలోని శింగరకొండ వెళ్లే రోడ్డులో ఉన్న కట్టారామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న బొల్లాపల్లి అశోక్‌కుమార్‌కు సమర్పించిన పరిశోధనకు నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి. మోహన్‌రావు గురువారం తెలిపారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించి సన్మానించారు.



అధ్యాపకుడిని సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



స్వర్ణలో చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ కృష్ణ

స్వర్ణ (కారంచేడు): వాతావరణ పరిస్థితులను బట్టి గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబల కుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని ఈఓపీఆర్డీ ఎల్‌కే కృష్ణ అన్నారు. గురువారం స్వర్ణలో ఆయన పరిశరాలను పరిశీలించారు. చెత్త సేకరణ విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో చెత్తా, చెదారం కనిపించకూడదన్నారు. ఎప్పటికప్పుడు చెత్తను సేకరించి, సంపద కేంద్రాలకు తరలించాలని కోరారు. హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ షేక్ ఖాశింసాహెబ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం ఆషాఢ మాసం చిత్త నక్షత్రం నవమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

రోడ్డు వేశారు.. దొంగ బావులు మరిచారు





చెన్నుపల్లి- వైదన రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దొంగబావులు

బల్లికురవ: రోడ్డు మలుపుల్లో ప్రమాదకరంగా దొంగబావులు ఉండటంతో ఏ సమయంలో ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. చెన్నుపల్లి -వైదన లింకురోడ్డును ఇటీవల 3 కోట్లతో అభివృద్ధి పరిచారు. ఈ రోడ్డులోనే సూరేపల్లి- ముక్తేశ్వరం గ్రామాల మధ్య సాగర్ ముక్తేశ్వరం మేజర్‌కాల్వ సమీపంలో రోడ్డుకి ఇరువైపులా 2 దొంగ బావులున్నాయి. మేజర్‌లోని నీరు ఈబావుల నుంచి పంట పొలాలకు వెళ్లాలి. రోడ్డు పక్కనే బావులు ఉండటంతో కొత్త వ్యక్తులు వాహన చోదకులు రాత్రిళ్లు గుర్తించలేకపోతున్నారు. రోడ్డు అభివృద్ధిలో భాగంగా బావులకున్న పై గోడలు ఇటీవల పడిపోయాయి. ప్రమాదాలు జరగకుండా బావుల పై గోడలను ఎత్తు పెంచి గుర్తించే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ప్లాస్టిక్ భూతంతో అనారోగ్యం



ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కలిగిస్తున్న డాక్టర్ దాసరి చంద్రశేఖర్

పర్చూరు (చినగంజాం): ప్లాస్టిక్ వాడకం వలన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. గురువారం అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల రహిత దినోత్సవం సందర్భంగా ప్రజలను చైతన్యవంతం చేయడం కోసం ఉప్పుటూరులో కార్యక్రమం నిర్వహించారు. ఉప్పుటూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులతో కలిసి గ్రామంలో ఉన్న షాపుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ వద్దు ఆరోగ్యమే ముద్దు అని వినూత్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వలన మనుషుల్లో అనేక రకాల కొత్త రోగాలు, క్యాన్సర్‌లు, స్త్రీ, పురుష ప్రత్యుత్పత్తి సమస్యలు వస్తున్నాయని, జంతుజాలాన్ని కూడా చిక్కుల్లో పెడుతోందని, ప్లాస్టిక్ సంచులు కాలువలో మురుగునీటికి అడ్డుపడి నీటి నిల్వలు ఏర్పడతాయని తెలిపారు. దీని వలన మలేరియా, డెంగీ వంటి అనేక రకాల అంటు వ్యాధులు ప్రబలమౌతున్నాయని, వీలైనంత వరకు అందరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని అన్ని షాపుల్లో ప్లాస్టిక్ కవర్‌లు తీసుకునే కన్నా ఒకే ఒక సంచితో బజారుకెళ్లే సరిపోతుందని, అది కుదరని పక్షంలో ఒక్క కవర్‌లోనే అన్ని పెట్టుకోవాలని సూచించారు. ఉప్పుటూరు వైద్య సిబ్బంది, సీహెచ్‌ఓ శృతి, ఆశా వర్కర్‌లు, అధ్యాపకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంఘాలకు యూనిక్ కోడ్



మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసరావు

అద్దంకి: ఒక గ్రూపులోని ఓ మహిళ వివిధ చోట్ల రుణం పొందే అవవకాశం లేకుండా, స్వయం సహాయక సంఘాల మహిళలకు యూనిక్ కోడ్‌ను ఇచ్చినట్లు డ్వామా పీడీ శ్రీనివాసరావు తెలిపారు. ఇక నుంచి ఆన్‌లైన్ ద్వారా బ్యాంకర్లకు సమాచారం అందిస్తున్నట్లు వివరించారు. గతంలో మాదిరిగా గ్రూప్ మొత్తం ఒకేసారి వస్తే రుణం మంజూరు చేస్తామని బ్యాంకర్లు అనడానికి వీలు లేదని తెలిపారు. గ్రూపులో ఎంతమందికి రుణం అవసరమైతే అంతమందికి మాత్రమే ఇవ్వాలని తెలిపారు. దాంతో అవసరం లేని మహిళలు రుణం తీసుకోవడం వల్ల తిరిగి చెల్లించడం కష్టం అవుతుందని చెప్పారు. స్వయం సహాయక సంఘాల మహిళలందరికీ రుణం ఇవ్వలేనందునే జిల్లాలో ఎక్కువ మంది మైక్రో ఫైనాన్స్‌ను ఆశ్రయించి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మన జిల్లాలో ఇప్పటి వరకూ 250 కోట్లు మైక్రో ఫైనాన్స్ ఇచ్చినట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. అవసరమైన వారికే రుణాలు ఇచ్చి అదే స్థాయిలో రికవరీ చేసే విధంగా యాక్షన్ ప్లాన్ తయారు చేసేందుకే బ్యాంకర్ల సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. వ్యాపారాలు చేసుకుని స్వయం సమృద్ధి సాధించే మహిళలకు మేనేజర్లు రుణం ఇచ్చి చేయూతనిస్తే వారు స్వయంగా ఎదిగి మరి కొంతమందికి ఉపాధి కల్పిస్తారని చెప్పారు. జిల్లాలో ఇంటి నిర్మాణం ముడిసరుకుల డిపోలను స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఆ తరువాత ఆన్‌లైన్ యాప్, వివరాల గురించి పవర్ ప్రజెంటేషన్‌తో డీపీఎం లక్ష్మణాచారి వివరించారు. సమావేశంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్ర, ఎల్‌డీఎం శివకృష్ణ, వ్యవసాయ శాఖ జేడీ రామకృష్ణ, మెప్మా సీఎంఎం శ్రీలత, మెప్మా సిబ్బంది, ఏపీఎంలు, ఐదు మండలాల్లోని వివిధ బ్యాంకు బ్రాంచ్ ప్రతినిధులు, సీసీలు పాల్గొన్నారు.

ఇద్దరు ప్రయాణికులకు హెల్మెట్ తప్పనిసరి



కారంచేడులో హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఖాదర్‌బాషా

కారంచేడు: హెల్మెట్ ధరించి ప్రాణాలను సురక్షితంగా కాపాడుకోవాలని కారంచేడు ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా సూచించారు. గురువారం వాడరేవు–పిడుగురాళ్ళ ప్రధాన రహదారిలోని కారంచేడు ఆర్‌సీఎం చర్చి సమీపంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ద్విచక్రవాహనదారులతో మాట్లాడారు. ఉద్యోగులు, వ్యాపారులు, కాలేజ్ స్టూడెంట్స్, సామాన్య ప్రజలు వివిధ పనుల నిమిత్తం ద్విచక్ర వాహనాల ద్వారా ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెట్‌ను ధరించాలన్నారు.

గతంలో హెల్మెట్‌పై వాహనదారుడికే అవగాహన కల్పించామని, ఇప్పుడు ఇద్దరు ప్రయాణికులు కూడా తప్పకుండా హెల్మెట్‌ను ధరించాలన్నారు. వాహన పత్రాలు కూడా వెంట తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సాయి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైకిల్ యాత్రికునికి సత్కారం



ముత్తు సెల్వన్‌ను సత్కరిస్తున్న తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్, సిబ్బంది

ఇంకొల్లు(చినగంజాం): పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సైకిల్ యాత్ర చేపట్టిన తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ముత్తు సెల్వన్ తన సైకిల్ యాత్రలో భాగంగా గురువారం ఇంకొల్లు చేరుకున్నాడు. 2021 డిసెంబరు 21న సైకిల్ యాత్ర చేపట్టిన ముత్తు సెల్వన్ ఇంకొల్లు తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్‌కు తన సైకిల్ యాత్ర విశేషాలు గురించి వివరించారు. 10 లక్షలు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలనే సైకిల్ ప్రారంభించినట్లు తెలిపారు. ముత్తు సెల్వన్ ఇప్పటి వరకు నేపాల్,బంగ్లాదేశ్ వంటి దేశాల్లో పర్యటించినట్లు, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో యాత్ర కొనసాగిస్తున్నట్లు తెలిపారు. 1111 రోజుల్లో 34200 కి.మీ ప్రయాణం సాగించటమే తన లక్ష్యం అని ఆయన వివరించారు. ఇప్పటి వరకు మన దేశంలో 23 రాష్ట్రాల్లో.. 575 జిల్లాల్లో పర్యటించానని ఇప్పటి వరకు 8,01,007 మొక్కలు నాటడం పూర్తయిందని వివరించారు. వరల్డ్ లాంగెస్ట్ సైక్లింగ్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించానని తెలిపారు. తాను వెళ్ళిన చోటు ప్రజలకు పర్యావరణంపై , మొక్కలు నాటడంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. 10 లక్షల మొక్కలు నాటే లక్ష్యం పూర్తి అయిన వెంటనే యాత్ర ముగిస్తానని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది ముత్తు సెల్వన్‌ను సత్కరించి, ప్రశంస పత్రం, ప్రయాణ ఖర్చులు అందజేశారు.

అందరికీ ఉపాధి పనులు

చీరాల టౌన్: సభల్లో ఉపాధి పనులను గుర్తించి ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలని ఏపీఓ దాసు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల్లో సచివాలయాల అడ్మిన్లు, ఎఫ్‌ఏలు, టీఏలతో ఉపాధి పనులపై సమావేశాన్ని నిర్వహించారు. ఏపీవో మాట్లాడుతూ గ్రామాల నుంచి వలస వెళ్లకుండా చర్యలు తీసుకుని ప్రతి కూలీకి జాబ్‌కార్డు అందించాలన్నారు. పనుల వివరాల నివేదికలు అందించాలని సూచించారు. కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డు అసిస్టెంట్లు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.